# గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 16, ప్రభాతవార్త :**
హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రాంగణం మొత్తం తిరిగి పరిశీలించారు. 10 రోజుల క్రితం విద్యార్థి వివేక్ మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అధికారుల విచారణలో నిజాలు వెలుగులోకి వస్తాయని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. గురుకుల ప్రాంగణం బయట లోపల సిసి కెమెరాలు పనిచేయాలని రాత్రి సమయంలో విధులు నిర్వహించే అధ్యాపకులు పూర్తి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆ రోజు జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే అధ్యాపకులకు తెలపాలని చెప్పారు. మంచి క్రమశిక్షణ అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## బాణసంచా విక్రేతలు పోలీసుల అనుమతి తీసుకోవాలి : ఏసిపి

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** బాణసంచా విక్రయదారులు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఏసిపి సదానందం అన్నారు. ప్రజల భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకుని దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయాల కోసం డివిజనల్ స్థాయిలో అనుమతి తీసుకోవాలని, అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేసినా, దుకాణాలను నెలకొల్పినా, భద్రతా ప్రమాణాలను పాటించకపోయినా పేలుడు పదార్థాల చట్టం 1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉపాయాలు విక్రయ దుకాణాలు రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేదా పెట్రోల్ బంకుల సమీపంలో వివాదాస్పద స్థలాల్లో, ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు తహసీల్దార్, ఫైర్, పోలీసుశాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు బాణసంచ విక్రయాలు జరపాలని నిబంధనలు పాటించకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ధాన్యం కొనుగోలులో
# రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జరిగేలా మిల్లర్లు, అధికారులు పనిచేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిసిఎస్‌ఓ తనూజ, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లై, డిఆర్డిఓ, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్ సీజనల్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సివిల్ సప్లైశాఖ అందించిన మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు చేయాలని అధికారులకు, మిల్లర్‌లకు సూచించారు. ఈ సీజనల్‌లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. జిల్లాలో 439 ధాన్యం కొనుగోలు కేంద్రాలకుగానూ 239 కేంద్రాలను ప్రారంభించినట్లు వివరించారు. తేమ శాతం రాగానే గన్ని బ్యాగుల్లో నింపి లోడ్‌చేసి మిల్లులకు పంపించాలన్నారు. ధాన్యం దిగుమతిలో అలస్యం చేయకుండా దిగుమతి చేసుకోగానే ఆన్‌లైన్‌లో ఎంట్రీచేయాలని సూచించారు. ఫిజికల్ స్టాక్, రిజిస్టర్ ఎంట్రీటాలీ కావాలన్నారు. ధాన్యం మళ్లించడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి డిటివో లక్ష్మణ్, డిఆర్డిఓ జయదేవ్ అర్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత పాటించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



పొడిచనపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**పాపన్నపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని పొడిచన్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. ధాన్యం తేమ శాతాన్ని సరిగా నిర్ధరించాలని, తాలు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా తమ దృష్టికి తీసుకు రావాలని రైతులను కోరారు. ఎప్పటికప్పుడు ధాన్యం తూకం చేసి తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. గన్ని బ్యాగులు, రికార్డులు, ఆన్‌లైన్ ప్రక్రియ చూశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బిల్లులు సకాలంలో వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, డైరెక్టర్, సభ్యుల పర్యటన

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ఈనెల 17న జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ డైరెక్టర్‌తో పాటు సభ్యులు పర్యటించనున్నారు. ఉదయం 10.30కి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్, సీపీలతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం మధ్యాహ్నం 12.30కి హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంను సందర్శించి ఇటీవల విద్యాలయంలో మృతి చెందిన విద్యార్థి మరణం సంఘటనపై విద్యార్థులు, తల్లిదండ్రులతో వేర్వేరుగా ఇంటరాక్ట్ అవుతారు.

## ఘనంగా పోషక ఆహార మాసోత్సవాలు

### హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**పటాన్‌చెరు, అక్టోబరు 16, ప్రభాతవార్త :** గర్భిణీలు, బాలింతలు, బాలబాలికలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సమతుల్య ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మున్నూరు కాపు సంఘం భవనంలో సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ(ఐసిడిఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషక ఆహార మాసోత్సవాలు, సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసల కార్యక్రమాలను మెదక్ ఎంపి రఘునందన్‌రావు, సంగారెడ్డిజిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ప్రదర్శనను తిలకించారు. అనంతరం 250 మంది గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. 50 మంది చిన్నారులకు అన్నప్రాసన, 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో మహిళలు, గర్భిణీలు, బాలింతలు, బాలబాలికల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీల పాత్ర ప్రశంసనీయమైనదన్నారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మహిళలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆరోగ్య తెలంగాణ కోసం పాటుపడుతున్నారని చెప్పారు. చిన్నవయసు నుండి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా యుక్త వయసులో అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అంగన్‌వాడీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలు మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి, ఐసిడిఎస్ జిల్లా అధికారి లలిత కుమారి, పటాన్ చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్ప నగేష్, గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, సిడిపిఓ జయరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.



పోషక ఆహార మాసోత్సవాల కార్యక్రమనికి హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# కార్యకర్తలు కోరుకున్న నాయకులకే డిసిసి

### ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌటేల



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు జ్యోతి రౌటేల

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
మండల, బ్లాక్, జిల్లా స్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను తీసుకొని పార్టీకోసం కష్టపడి పనిచేసిన నాయకుడిని జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకులు జ్యోతి రౌటేల అన్నారు. జిల్లా కేంద్రంలోని చంద్రమౌళి గార్డెన్‌లో గురువారం సిద్దిపేట అర్బన్, పట్టణ, రూరల్, నారాయణరావుపేట మండలాల నాయకులు, కార్యకర్తలతో సంఘటన్ సజన్‌అభియాన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ పరిశీలకులు చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, జగదీష్, నజీమ్‌అహ్మద్, వరలక్ష్మీతో కలిసి ఆమె విలేరులతో మాట్లాడారు. కార్యకర్తలు కోరుకున్న నాయకుడే డిసిసి అధ్యక్షుడిగా ఎంపిక అవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల వారికి సముచిత స్థానంకల్పించి కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టిపిసిసి పరిశీలకులు, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుకూలంగా పనిచేస్తున్నవారికే డిసిసి అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ దళిత, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. మోడీని గద్దెదింపి రాహుల్‌ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం డిసిసి అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఔత్సాహికులు తమ తమ దరఖాస్తులను కమిటీకి అందజేశారు.

సమావేశంలో టిపిసిసి చేనేత విభాగం చైర్మన్ గూడూరి శ్రీనివాస్ (ఎస్టీడి), టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, నియో జకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, ఆర్టీఏ సభ్యులు, డిసిసి ఓబిసిసెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్య చంద్రవర్మ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా డిసిసి అధ్యక్షుడి ఎంపిక

### ఎఐసిసి అబ్జర్వర్ జరిట లైత్‌ఫ్లాంగ్

**జోగిపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో డిసిసి అధ్యక్ష పదవికి చాలా ప్రాముఖ్యత పెరగనుందని, అందుకే అధ్యక్షపదవి ఎంపికను చాలా పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందుకోసం నియోజకవర్గాలవారీగా అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఏఐసిసి అబ్జర్వర్ జరిట లైత్‌ఫ్లాంగ్ అన్నారు. గురువవారం జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్ష పదవి ఎంపికకు నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకముందు డిసిసి అధ్యక్షుడి పాత్ర చాలా కీలకం కానున్నదని, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే విషయంలో డిసిసి అధ్యక్షుడి అభిప్రాయం ఎంతో కీలకం కానుందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా పిఇసిలో మాత్రమే ఎలక్షన్ కమిటిలో డిసిసి అధ్యక్షులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎవరైతే అన్ని రకాలుగా పార్టీ అభ్యున్నతికోసం నిరంతరంగా కష్టపడతారో అలాంటి వారికే ఈ పదవి కట్టబెడతామని అన్నారు. ఇందుకుగాను జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామని, జహిరాబాద్ నియోజవకర్గ సమావేశం అయిన అనంతరం, పార్టీ పదవికోసం వచ్చిన దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేసి ఆరుగురి పేర్లను మాత్రమే ఏఐసిసికి పంపటం జరుగుతుందని, అందులో అందరికంటే అన్ని రకాలుగా పార్టీకోసం కష్టపడేవారిని డిసిసి అధ్యక్షుడిగా నియమించటం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. నవంబర్ మొదటివారంలో డిసిసి అధ్యక్షుడి నియామకాన్ని ప్రకటిస్తారని తెలిపారు. పార్టీలని బ్లాక్‌స్థాయి నుంచి పటిష్ఠంగా తయారు చేయటం కోసం అన్నివిధాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, పిసిసి ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మెన్ అంజన్న, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటి చైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బి.శివరాజ్, జోగిపేట మాజీ కౌన్సిలర్లు డాకూరి శంకర్, రంగ సురేష్‌గుప్త, సురెందర్‌గౌడ్, దుర్గేష్, చందర్, మాజీ ఎంపిటిసి డాకూరి వెంకటేశం, పిఏసిఎస్ చైర్మెన్ నరెందర్‌రెడ్డి, నాయకులు కొశికె రాజశేఖర్, ఉల్వల సతీష్, గుర్రపు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసిసి అబ్జర్వర్ జరిట లైత్‌ఫ్లాంగ్

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నాయిని యాదగిరి దరఖాస్తు

**గజ్వేల్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియలో భాగంగా గురువారం గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితుడినై కార్యకర్తగా మొదలుకొని రాష్ట్ర స్థాయి నాయకునిగా ఎదిగానని, పార్టీ బలోపేతం కోసం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. గతంలో ఎన్నడూ జిల్లా అధ్యక్ష పదవి బిసి వర్గానికి లభించలేదని, ఈసారి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం బిసి వర్గానికి అవకాశం ఇవ్వాలన్నారు. బిసిలకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో గజ్వేల్ నియోజకవర్గంతో పాటు సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.



అధ్యక్ష పదవికి దరఖాస్తు చేస్తున్న నాయిని యాదగిరి

# వివేక్‌ది హత్యా...ఆత్మహత్యా.. !?

### * 'గురుకుల'విద్యార్థి మృతిపై వీడని మిస్టరీ * ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణలు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 16, ప్రభాతవార్త**
హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి వివేక్‌ది హత్యా.. లేక ఆత్మహత్యనా అనే మిస్టరీ పదిరోజులైనా ఇంకా వీడలేదు. ఘటనాస్థలాన్ని పరిశీలించి చూస్తే అక్కడ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లుగానీ లేదా ప్రమాదం జరిగినట్లుగాని ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది. సంఘటన వద్ద పరిశీలిస్తే స్టీల్‌రేలింగ్‌కు కట్టిన బట్టతాడుకు విద్యార్థి ఉరి వేసుకున్నట్లు ఉపాధ్యాయులు చెబుతుండగా కేవలం నాలుగు అడుగుల ఎత్తులో ఉన్న తాడుకు ఉరేసుకుంటే అంతకంటే ఎత్తుగా ఉన్న విద్యార్థికి ఎలా ఉరిపడుతుందనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. రెయిలింగ్‌కు ఉన్న బట్టతోనే విద్యార్థి ఉరేసుకున్నట్లయితే వివేక్ మెడకు పడ్డ అచ్చులు మందంగా ఉండాలని కానీ మెడను పరిశీలిస్తే అంతకు ముందే ఉన్న నల్లటి దారం అచ్చులు మాత్రమే కనిపిస్తున్నాయి. అదే దారంతో ఎవరో లాగి హత్య చేయడంతో పాటు దానిని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారనే గుసగుసలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే బట్టకు ఉరి వేసుకున్నట్లయితే బట్ట కాస్తయినా సాగి కనిపించాలి కానీ అలా ఏమి కనిపించడం లేదు. అయినా సంఘటన జరిగిన ముందు రోజు అక్కడ ఉన్న రేలింగ్‌కు ఎలాంటి తాడు లేదని తోటి విద్యార్థులు చెప్పడం కూడా కొన్ని అనుమానాలకు దారి తీస్తుంది. ఇదిలా ఉంటే విద్యార్థుల తల్లితండ్రులు విద్యార్థిది ఖచ్చితంగా హత్యనే అని ఆరోపిస్తుండగా మరి కొంత మంది విద్యార్థుల తల్లితండ్రులు హాస్టల్‌లో గతంలో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలను ఇప్పుడు బయటపెడుతున్నారు. పాఠశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్‌లను బాత్ రూంలలోకి తీసుకువెళ్లి హోమో సెక్స్ చేసే వారని అయితే ఒక నెల రోజుల క్రితం ఒక విద్యార్థిని సీనియర్ విద్యార్థి హోమో సెక్స్ చేసేందుకు బాత్రూంలోకి తీసుకెళ్లగా జూనియర్ విద్యార్థి అందుకు ఒప్పుకోకపోగా పెద్దగా అరవడంతో గమనించిన మిగతా విద్యార్థులు అతన్ని ఇష్ట వచ్చినట్లు కొట్టారని ఈ గొడవలో సీనియర్ విద్యార్థికి తీవ్ర గాయాలుకాగా హుస్నాబాద్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించిన అధ్యాపకులు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడ్డారని తెలిసింది. అయితే గాయపడిన విద్యార్థికి వైద్యం అందించిన డాక్టర్ అల్లుడు కూడా అదే పాఠశాలలో చదువుతుండడంతో విషయం వాళ్ల అక్కకు చెప్పడంతో ఆ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదిలాఉంటే విద్యార్థి మృతికి సంబంధించిన విషయంలో పాఠశాలను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై తల్లితండ్రులు మండి పడుతున్నారు. నిస్పక్షపాతంగా విచారణ జరపాలని ఆదేశించాల్సిన మంత్రి విచారణ ప్రాథమిక దశలో ఉండగానే స్వయంగా మంత్రే ఒక ఆరోపణ చేయడం పరోక్షంగా పోలీసుల దర్యాప్తును ప్రభావితం చేయవచ్చనే అనుమానాలు వస్తున్నాయి.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**మంత్రి మాటలను వెనక్కి తీసుకోవాలి...**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం జాతీయ మాల మహానాడు, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ నెల 7వ తేదీ జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి వివేక్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, మృతికి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ దేవయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను సందర్శించి వివేక్ ఆటలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగిందని మాట్లాడటాన్ని తప్పు బట్టారు. మంత్రి మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వివేక్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ. 50 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి తల్లితండ్రులు సానాది సత్యనారాయణ, లావణ్య, బిళ్ళం రాములు, జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఆరె కిశోర్, దళిత నాయకులు బొజ్జ హరీష్, పట్టణ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ మంకాల రమేష్, సానాది లక్ష్మణ్, సానాది యాదగిరి, గుమ్మడి సాయిశ్రీరామ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



మర్కుక్ పోలీసులకు సూచనలు ఇస్తున్న సిపి విజయ్‌కుమార్

## శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

### సిపి విజయ్‌కుమార్

**మర్కుక్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** మర్కుక్ పోలీస్‌స్టేషన్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ గురువారం అకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాల సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకమైన అసాంఘిక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలకు సంబంధించిన విపిఓలు రెండుమూడు రోజులకు ఒకసారి గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించేలా పనిచేయాలని ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయతీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పాత నేరస్థులపై తరచూ తనిఖీలు చేస్తూ వారిపై నిఘా ఉంచాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం మొదటిసారిగా మర్కుక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింహులు, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్ పాల్గొన్నారు.

### సత్‌ప్రవర్తనతో మెలగాలి : సిఐ

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీసు ఠాణాలో గురువారం హిస్టరీ సీటర్స్‌లకు సిఐ రేణుకరెడ్డి పలు సూచనలు చేశారు. సత్‌ప్రవర్తనతో మెలగాలని హితువు పలికారు. ఇక ముందు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సబ్బుద్దితో ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హిస్టరీ సీటర్స్‌లపై నిగా పెట్టి ఉంటుందని, ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ, ఏఎస్ఐ పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**సిర్గాపూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తోల్యా తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ కథనం ప్రకారం... ఇందుకు సంబంధింపి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజేశ్వర్ తండాకు చెందిన జీజాబాయి(48) తోల్యాతండాలోని చిన్న కూతురు అర్చన వద్ద ఉంటోందన్నారు. ఇటీవల ఆటోలో వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బ తగిలిందన్నారు. ఆసుపత్రి ఖర్చులకు రూ. 30 వేల వరకు ఆటో బాధ్యుడు ఇవ్వగా ఆ డబ్బులను అల్లుడు శంకర్ తీసుకుని తాగుడుకు దుబారా చేశాడు. కాగా డబ్బుల విషయమై రెండు రోజుల క్రితం అల్లుడిని నిలదీస్తే గొడవకు దిగడంతో జీవితంపై విరక్తి చెందిన జీజాబాయి పొలంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలి కుమారుడు ప్రేమ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**కొల్చారం, అక్టోబరు 16(ప్రభాతవార్త):** గత సోమవారం మంజీరానదిలో చేపలు పట్టడానికి వెళ్లి అప్పాజీపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన సురేష్(23) గల్లంతైన విషయం తెలిసింది. నాటి నుంచి పోలీసులు, గజ ఈతగాళ్లు, ఎన్‌డిఆర్ఏ బృందం సురేష్‌కోసం గాలిస్తూనే ఉన్నారు. నాలుగు రోజుల తర్వాత సురేష్ మృతదేహం వనదుర్గ ప్రాజెక్టు కింది భాగంలో తుమ్మల బొడ్డే ప్రాంతంలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలకు దొరికింది. సురేష్ తల్లిదండ్రులు లక్ష్మి, కిషన్‌లకు ముగ్గురు సంతానం. ఇద్దరు అక్కల వివాహంకాగా సురేష్‌కు ఇంకా వివాహం కాలేదు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఆర్టీసి బస్సు ఢీ.. ఒకరి మృతి

**జహీరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన గొల్ల పండరి (42) దిగ్వాల్‌లో అద్దె ఇంట్లో ఉంటూ సోలార్ కంపెనీలో పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. రోజులాగే కంపెనీలో పనులు ముగించుకుని టీవీఎస్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో జహీరాబాద్ డిపోకు చెందిన డీలక్స్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పండరిని చికిత్స నిమిత్తం జహీరాబాద్‌లోని సన్రాయ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు భంగి జగన్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## శీలంపల్లి శివారులో రెండు బైకులు ఢీ

### ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**చిలిపిచెడ్, అక్టోబరు 16(ప్రభాతవార్త):** చిలిపిచేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శీలంపల్లి శివారులో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం ప్రకారం... చిలిపిచేడ్ మండలం రహీమ్‌గూడా తండాకు చెందిన కేతావత్ శర్మన్(55)శీలంపల్లి గ్రామం నుండి స్వగ్రామం వెళ్లడానికి బుధవారం సాయంత్రం గంగిరెద్దులగుడాకు చెందిన బత్తుల శ్రీను బైక్‌పై ఎక్కాడు. సోమక్కపేట గ్రామానికి చెందిన బందెల్లి శీలంపల్లి వైపు వెళ్తున్న క్రమంలో శీలంపల్లి గ్రామ శివారులో వేగంగా ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బత్తుల శ్రీను బైక్‌పై కూర్చున్న కేతావత్ శర్మన్ కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కకడే మృతి చెందాడు. వాహనాలు నడుపుతున్న శ్రీను, బందెల్లికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి జరిమానా

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 16(ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి రూ.37,500 జరిమానా విధించడంతో పాటు ముగ్గురికి ఒకరోజు జైలుశిక్ష విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టు రావడంతో వారిని గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరుచగా విచారణ చేసి 27 మందికి రూ.37,500 జరిమానా, ముగ్గురికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

## తెలంగాణ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



తెలంగాణ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. చిత్రంలో అధ్యక్షులుగా ఎన్నికైన సుదం మాధవి తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

తెలంగాణ బాడీ బిల్డర్స్ ఫిజిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. గత నెల సెప్టెంబర్ 28న ఎన్నికలు నిర్వహించి జనరల్ బాడీ ద్వారా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ బాడీ బిల్డర్స్ ఫిజిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షురాలిగా సుదం మాధవి, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా రంజన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా,యేసప్ప,కోశాధికారిగా మొహమ్మద్ ఇమ్తియాజ్ తదితర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సుదం మాధవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బాడీ బిల్డింగ్ క్రీడలకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు కొత్త కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అసోసియేషన్ బిల్డింగ్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతిజ్ఞ చేసింది. ఫిజిక్ స్పోర్ట్స్ కొత్త నాయకత్వంతో అసోసియేషన్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు. తెలంగాణ బాడీ బిల్డర్స్ ఫిజిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ భారత ప్రభుత్వ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ,తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్‌ల గుర్తింపు పొందిన ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ (ముంబై) అనుబంధ సంస్థగా పనిచేస్తోందని తెలిపారు.

## విద్యార్థులు విశ్లేషణాత్మకమైన అంశాలపై దృష్టి సారించాలి : జస్టిస్ విజయసేన్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి జి.వినోద్ తదితరులున్నారు.

**చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

న్యాయ విద్యార్థులు విశ్లేషణాత్మకమైన అంశాలపై దృష్టిని కేంద్రీకరించి పట్టు సాధించడానికి చొరవ చూపాలని తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి అన్నారు. బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరుగుతున్న విద్వత్ లా ఫెస్ట్ ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ విజయసేన్ రెడ్డి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యాయరంగంలో యువ న్యాయ విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి ఈ ఫెస్ట్ ఒక ముఖ్యమైన ఈ కార్యక్రమంగా పేర్కొన్నారు. విధ్యార్థులలో చట్టపరమైన విశ్లేషణ తార్కిక ఆలోచన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, ఇటువంటు కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి హెచ్ పంచాక్షరి, డాక్టర్ రాంప్రసాద్, విద్యాసంస్థల కార్యదర్శి, మాజీ మంత్రి జి.వినోద్, విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.సరోజా వివేక్, ప్రొఫెసర్ లింబాద్రి, పి.వి.రమణ కుమార్, ప్రియ అయ్యంగార్, ప్రొఫెసర్ విష్ణుప్రియ, డాక్టర్ జి.యాదగిరి, అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా న్యాయ కళాశాల నుండి న్యాయ విద్యార్థులు, అధ్యాపకులు, సీనియర్ న్యాయవాదులు, విద్యావేత్తలు, పరిశోధకులు, న్యాయ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అన్ని డిపోల ఎదుట నిరసన ప్రదర్శనలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

**సైఫాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్‌ల కోసం బిసి-జెఎసి ఇచ్చిన పిలుపు 'తెలంగాణ బంద్'కు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య, జోనల్ కార్యదర్శి వెంకటయ్య, గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు ఈ బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర బంద్‌కు మద్దతుగా ఈ నెల 17 తేదీన శు క్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట మధ్యాహ్నం భోజనవిరామ సమయంలో కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపడతారని చెప్పారు.ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు జనాభా ప్రాతిపదికన ఇస్తున్న రిజర్వేషన్‌ల మాదిరిగానే బిసిలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని, అప్పటి వరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## అయోధ్యలో 1008పుణ్యదంపతులకు షష్టిపూర్తి కార్యక్రమం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

**సైఫాబాద్, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

అఖండ భారతంలో తొలిసారిగా 1008 పుణ్య దంపతులతో వేదోచ్చరణ, రామనామ స్మరణలతో ఘనంగా సామూహిక ఉగ్రరథ శాంతి (షష్టిపూర్తి) మహోత్సవం నిర్వహిస్తున్నామని ఇండియా ఇంటర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రామరాజు కల్చర్ ట్రస్ట్ తెలిపింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, ట్రస్ట్ ముఖ్య ప్రతినిధి కల్వు చంద్రశేఖర్‌రావు, ప్రతినిధులు విజయలక్ష్మి, పల్లవి, మురళికృష్ణ తదితరులు ఈ మేరకు ఈ షష్టిపూర్తికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అయోధ్యలో జరిగే ఈ కార్యక్రమంలో 59 సంవత్సరాలు పూర్తి చేసిన 60 ఏళ్ళు ఆపైనా వయసు ఉన్న సమస్త పుణ్యదంపతులకు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. డిసెంబరు 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, వచ్చిన దంపతులకు, వారి వెంట వచ్చేవారికి అన్ని రకాలు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. పుణ్య దంపతులు ఇద్దరికి అన్ని వసతులతో 21,116, షష్టిపూర్తిలో పాల్గొనే దంపతులకు 11,116, వెంట వచ్చే వారికి అదనంగా చెల్లించవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు, రిజిస్ట్రేషన్‌కు 9701400333 నెంబరులో సంప్రదించాలని కోరారు

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుటున్న తలసాని

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఉచిత వైద్యశిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్‌లోని బికె.గూడలో శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు పార్థసారథి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తమ వయసును సైతం లెక్క చేయకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యల బారిన పడి అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందులతో సరైన వైద్యం పొందలేక పోతున్నారని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందాలనే ఉద్యేశంతో అరోగ్య శ్రీఅనే గొప్ప కార్యక్రమాన్ని దివంగత ముఖ్య మంత్రి వైఎస్ఆర్ నప్రారంభించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నాటి ముఖ్య మంత్రి కేసిఆర్ దానిని కొనసాగించారని వివరించారు.ఈ కార్యక్రమంలో సనత్ నగర్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు పార్థసారధి, అమీర్‌పేట్ ఆస్టర్‌ప్రైమ్ అసుపత్రి డాక్టర్లు ప్రియాంక, సురేశ్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు దూబే, మాణిక్ రావ్ పాటిల్,అనంతరెడ్డి, సహదేవ్ గౌడ్, సీనియర్ నాయకులు కర్నాకర్‌రెడ్డి, సురేశ్ గౌడ్,ప్రవీణ్‌రెడ్డి,రాజేశ్ ముదిరాజ్,ఖలీల్, అశోక్ యాదవ్, గోపిలాల్ చౌహాన్,కూతురు నర్సింహ్మా,కట్ట బలరామ్, పీయూష్ గుప్తా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు

### -రైతులకు శాస్త్రవేతలు పలు సూచనలు



**అత్తాపూర్ అక్టోబరు16,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం,కోళ్ల పరిశోధనా కేంద్రం (పిఆర్ఎస్),రాజశ్రీ కోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి" అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డా. కృష్ణదైద, డా. డి.అనిల్ పవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పివిఎన్ఆర్‌టివియు విస్తరణ సంచాలకులు డా. ఎం. కిషన్ కుమార్ , కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. మధురి హాజరై రైతులకు కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు మరియు గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధిపై సూచనలు సలహాలు ఇచ్చారు.డా. డి అనిల్ పవన్ ప్రధాన శాస్త్రవేత్త, గుడ్ల నాణ్యత మరియు రంగుల గుడ్ల ఉత్పత్తి లో దాన ప్రాముఖ్యతపై విశ్లేషణాత్మకంగా శిక్షణ ఇచ్చారు.డా. రామకృష్ణ , అసోసియేట్ ప్రొఫెసర్ (అగ్రానమీ), పెరటికోళ్ల పెంపకం లో సంప్రదాయేతర దానా వినియోగంపై ప్రయోగాత్మక వివరాలు అందించి సందేహాల నివృత్తి చేశారు.డా. వినయశ్రీ , అసోసియేట్ ప్రొఫెసర్, సాంప్రదాయ పద్ధతుల ద్వారా నాటు కోళ్ల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు.రైతులు రాజశ్రీ కోళ్ల పెంపకం ద్వారా గుడ్లు, మాంసం ఉత్పత్తితో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాల విస్తరణపై అవగాహన పొందారు.డా. కృష్ణ దైద , హెడ్ ప్రధాన శాస్త్రవేత్త (పిఆర్ఎస్) మాట్లాడుతూ, రైతులు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ఉపయోగించి కోళ్ల పెంపకాన్ని వ్యవస్థీకృత వ్యాపార సరళిలో అభివృద్ధి చేయాలని, దానివల్ల గ్రామీణ స్థాయిలో స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 60 మంది రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్ సమస్యలు పరిష్కారిస్తా

### -ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఫార్మాసి రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్‌గౌడ్

**బేగంబజార్,అక్టోబర్ 21ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పరీక్షలు వ్రాసిన ఫార్మాసి ఆఫీసర్‌కు వెంటనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ రిలీజ్ చేసి అర్హత పొందిన వారికి వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలి,104 సర్వీస్‌లో పని చేసిన ఫార్మాసి ఆఫీసర్స్ అందరికి ఏప్రిల్ 2025 నుండి కంటిన్యూయేషన్ ఇచ్చి వెంటనే ఏడు నెలల వేతనాలు ఇవ్వాలని,క్లీయర్‌వెకెన్సీ పోస్ట్ అడహక్ ప్రమోషన్ ఇవ్వాలి,ఫార్మాసి ఆఫీసర్స్‌కు విపరీతమైన పనిబారం, ఉన్నందున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో ముగ్గురు ఫార్మాసిస్టులను నియమించాలి,నూతనంగాఏర్పాటు చేసిన 23 జిల్లాలోని ఫార్మాసి స్టోర్స్‌లలో,వ్యాక్సిన్ స్టోర్స్, మలేరియా,లెప్రసీ స్టోర్స్‌లలోజిల్లా ఫార్మాసి ఆఫీసర్స్ పోస్టను మంజూరు చేయాలని,జి.ఓ.ఎం.ఎస్. నెం 1188 ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఫార్మాసి ఆఫీసర్స్‌కు 22వేల నుంచి 27వేల 599కు పెంచాలన్నారు.మరో అదనంగా మరో 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డిన్ని కలిసి విన్నవించారు.అందుకు ఆయనసానుకూలంగా స్పం దించి వీలైనంత తొందరంగా పరిష్కరించేందుకుగాను హామి ఇచ్చిన ట్లుటి.జి.పి,ఓఎ రాష్ట్ర అధ్యక్షలు జాలిగామ అశోక్ తెలిపారు.

## జెహెచ్‌పిఎస్‌లో సైబర్ భద్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ నిపుణురాలు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 16, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జెహెచ్‌పిఎస్)లో సైబర్ సెక్యూరిటీపై నిర్వహించిన మూడు రోజుల అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది. 7, 8, 9 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కేపీఎంజీ సహకారంతో నిర్వహించారు. డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా, బాధ్యతాయుతంగా నావిగేట్ చేయడానికి అవసరమైన జ్ఞా నం, ఆచరణాత్మక వ్యూహాలతో సన్నదం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ బెదిరింపులు, వ్యక్తిగత డేటా వినియోగం, పాస్‌వర్డ్ రక్షణ, ఫిషింగ్ స్కా మ్‌లు, సైబర్ బెదిరింపు, డేటా గోప్యత, సోషల్ మీడియా ప్రమాదాలు, సురక్షిత బ్రౌజింగ్ తదితర అంశాలను నిపుణులు వివరించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన గుత్తేదారుపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 16, ప్రభాతవార్తః** ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న ఒక గుత్తేదారుపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలో 371 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి అందులో భవానీశంకర్ అనే గుత్తేదారు నిర్మాణాలు చేపట్టాడు. ఈ వ్యవహారంపై షేక్‌పేట తహసిల్దార్ అనితారెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 403లోని 371 గజాల స్థలంలో ప్రహరీతోపాటు నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు భవానీ శంకర్‌పై బీఎన్ఎస్ 329(3), 324(3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టిఆర్‌పి పార్టీలో ప్రజాసేనపార్టీ విలీనం

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ విధానాలకు ఆకర్షితులై టిఆర్‌పి పార్టీలోకి వస్తున్నారని వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్‌గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ,కోరుట్ల నియోజకవర్గం కి చెందిన ప్రజా సేన పార్టీ అధ్యక్షులు ఆకుల హనుమండ్లు తమ పార్టీ ని హరిశంకర్ గౌడ్ సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో వీలీనం చేశారు. ఈ సందర్భంగా హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో 2028 లో బిసిల ప్రభూత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యం అని అన్నారు. అదే విదంగా ప్రభుత్వానికి బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశం పై చిత్తు శుద్ధి లేకుండా రాజకీయ అవసరాల కోసం వాడుకుంటు,బిసిలను మభ్య పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం చట్ట బద్ధంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకుండా పార్టీ పరంగా కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే సహించిది లేదు అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్, సంగెం సూర్యరావు , మదన్మోహన్ చారి, అశోక్ ముదిరాజ్ , జ్యోతి పండాల్ , లింగాల గంగధార్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ గెలుపు

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్ 4లో ఆతిథ్య జట్టు హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ పుంజుకుంది. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో గోవా గార్డియన్స్‌పై 1513, 2018, 1517, 1519తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ అదిరే విజయం సాధించింది. ఎటాక్, డిఫెన్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సూపర్ సర్వ్‌లు, కళ్లు చెదిరే స్పైక్‌లతో దండెత్తింది. గ్రూప్ దశలో రెండో విజయం ఖాతాలో వేసుకున్న బ్లాక్‌హాక్స్ పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది. బ్లాక్ హాక్స్ స్పైకర్ యుడి యమమోటో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. నాలుగు సెట్ల పోరులో గోవా గార్డియన్స్‌పై మెరుపు విజయం సాధించిన హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆటగాళ్లను ఆ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి అభినందించారు. బ్లాక్‌హాక్స్ ఆటగాళ్లలో శిఖర్ సింగ్, సాహిల్ కుమార్, యమమోటోలు రాణించారు.

## 18న బిసి రిజర్వేషన్‌లకు మద్దతుగా బంద్ పాటించాలి : దేశబోయిన రఘు





సమావేశంలో మాట్లాడుతున్న దేశబోయిన రఘు తదితరులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 16 ప్రభాతవార్తః**

బీసీ బిల్లును అనుసరించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ జారీ చేసిందని, కాగా 42 శాతం బీసీ బిల్లును వ్యతిరేకిస్తూ ఇద్దరు రెడ్డి వర్గానికి చెందిన వారు హైకోర్టును ఆశ్రయించడం వల్ల తెలంగాణ హైకోర్టు వారి పిటిషన్ పరిశీలించి 42 శాతం బీసీ రిజర్వేషన్కు వ్యతిరేకంగా వారికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు నిరసన తెలపాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం, అధ్యక్షుడు హైకోర్టు ప్రముఖ న్యాయవాది, డాక్టర్ దేశ బోయిన రఘు తెలిపారు. వారాసిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు కు మద్దతుగా 18 నాడు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్ర గంగపుత్ర సంఘం ఈ బందుకు పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం గౌరవాధ్యక్షుడు కార్మకొండ యాదగిరి, జాతీయ మత్యకార సంఘం తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు అక్కపల్లి ఉదయ్ కిరణ్, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం కార్యదర్శులు దామెన సదానంద, వంగల సుధాకర్, అంబటి రమేష్‌లు పాల్గొన్నారు

## జూబ్లీహిల్స్ బరిలో నిరుద్యోగులు

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో నిలిచేందుకు నిరుద్యోగులు సన్నదమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిన కారణంగా ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇవ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే దిశగా ఎన్నికల బరిలో నిలిచి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి కదిలి వస్తున్నామని్లి నిరుద్యోగి అస్మా తెలిపారు. జివో నం 46, జివో నం 29, జివో నం 108 తదితర అంశాలలో ఉన్న అన్యాయాలు తొలగించకుండా గ్రామీణ ప్రాంత అభ్యర్థులకి న్యాయం చేయలేని ఈ ప్రభుత్వం ప్రజలకి హానికరం కాబట్టి జూబ్లీహిల్ ఇప్పుడు వాళ్ళ మాయమాటలకు ప్రజలు లొంగవద్దు అని కాంగ్రెస్ పార్టీకి ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయొద్దని చేతులెత్తి జూబ్లీహిల్స్ ప్రజలని వేడుకుంటున్నాం అన్నారు. ఈ సమావేశంలో ఓయూ జేసీ ఇంద్ర నాయక్, జనార్దన్, అస్మా, నవీన్, వెంకట్, శంకర్, శింబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 18న బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



బంద్‌ను విజయవంతం చేయాలని కార్ల ర్యాలీ నిర్వహిస్తున్న బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలని బిసి జేఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. లేనిపక్షంలో బలవంతంగా బంద్ చేయవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్లపై తలపెట్టిన బంద్‌కు మద్దతుగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్ బీసీభవన్ నుండి గన్‌పార్క్ వరకు భారీ ఎత్తున కార్ల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా మారాలని కోరారు.ఈ వ్యవస్థలు బీసీలకు అనుకూలంగా మారాలని వారిపై ఒత్తిడి తీసుకురావడానికి ఒక పెద్ద ప్రజా ఉద్యమాన్ని అక్టోబర్ 18న తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ బంద్‌కు సబ్బండ వర్గాల నుండి మద్దతు లభిస్తున్నందున విద్యాసంస్థలు, పాఠశాలలు, కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, మాల్స్, పెట్రోల్ బంక్‌లు ప్రతి ఒక్కటి సహకరించాలని కోరారు. లేనిపక్షంలో బలవంతంగా బంధు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు ఒకే అంటున్న..కోర్టులో కేసుల ద్వారా మళ్లీ మొదటికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా ఉన్న బీసీ జనాభా అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఇప్పటికే బీసీ విద్యార్థుల పట్ల స్కాలర్ షిప్‌లు,లోన్ ల విషయంలో బీసీలను చిన్నచూపు చూడడం జరుగుతుందన్నారు. దీనివలన బీసీలకు సరైన గుర్తింపు రావాలంటే పెద్ద ఎత్తున పోరాటం చేయకపోతే అది సాధ్యం కాదని తెలిపారు.అన్ని రాజకీయ పార్టీలు ఈ బంద్‌కు మద్దతు తెలిపాయని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలనిపించింది పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గవ్వల భరత్ కుమార్,టి.రాజ్‌కుమార్,రాజు నేత, నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, చెరుకు మణికంఠ, ఆశిష్,రాందేవ్, నిఖిల్,అనురాధ, పద్మ, శివకుమార్ గౌడ్,నరేష్,శివలీల తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి పిఎస్‌ను సందర్శించిన ఆంధ్రవిద్యాలయం విద్యార్థులు



చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు స్టేషన్‌కు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్

**చిక్కడపల్లి,అక్టోబరు 16 ప్రభాతవార్త:** చిక్కడపల్లి వివేకనగర్ ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థినులు, ఉపాధ్యాయులు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు స్వీకరించిన తర్వాత ఏ విధంగా చార్జ్ షీట్ వరకు వెళ్తుందో వారికి క్షుణ్ణంగా వివరించారు. 100 డయల్, క్రైమ్, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్, పోలీస్ స్టేషన్ లో ఫంక్షనింగ్ లో ఉన్నటువంటి అన్ని వర్టికల్స్ గురించి వివరించారు. ఇదే సమయంలో విద్యార్థులకు ఎటువంటి చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారికి అవసరమైనటువంటి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శంకర్ నాయక్, అడ్మిన్ ఎస్ఐ అభిలాష్, ఎస్ఐ మోనిక, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచిరేవుల బ్రిడ్జిపై మట్టిని తొలగించాలని కమిషనర్‌కు వినతి



మంచిరేవుల బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని నార్సింగి మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నాయకులు.

**నార్సింగి, అక్టోబర్ 16 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని కోరుతూ బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండిపేట జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున మూసీనది పొంగిందని, పక్షం రోజుల పాటు నార్సింగి-మంచిరేవుల మధ్య ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద పారిందని తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున బురద బ్రిడ్జిపై ఉండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఆ బురదను తొలగించి వాహనదారులను ప్రమాదాల నుంచి కాపాడాలని కమీషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరామని వివరించారు. కమీషనర్ కు వినతిపత్రం ఇచ్చిన వారిలో బిఆర్ఎస్ నాయకులు ముత్యాలు, ముక్తార్, మల్లేష్,రవియాదవ్, చిరంజీవి ఉన్నారు.

## ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రికి ఆర్థిక సహాయం



చెక్కును అందచేస్తున్న డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ

**గన్‌ఫౌండ్రి,అక్టోబర్ 16ప్రభాతవార్త:** ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆదుకునేందుకుగాను తమ మంతు సహాయంగా ఆసుపత్రి డైరెక్టర్ బెంజిమెన్‌కు అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్, టిఎన్‌జి కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేనీ 21వేల చెక్కునుఅందచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోప్రతినెల మూడు వారాలు వైద్యం కోసం వచ్చే రోగి సహాయకులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు.ఈ ఆర్థిక సహాయం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రోగులకు అవసరమైన సహాయాన్ని అందించడానికి ట్రస్ట్ చేపట్టన నిరంతర సేవా కార్యక్రమాల భాగమన్నారు. ఈకార్యక్రమంలో టిఎన్‌జిఓ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్,హైదరాబాద్ జిల్లాకార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్,క్యాన్సర్ ఆసుపత్రి నర్సింగ్ సూపరిండెంటెంట్ పుష్పలత, టిఎన్‌జిఓ సెక్రటరీ శంకర్,క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ అధ్యక్షులు శివకుమార్,కార్యదర్శి శేఖర్, సాయి,హరీష్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



శబరిమల కొండకు పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములకు మెడికల్ కిట్లను అందజేస్తున్న మాజీ కార్పోరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్.

## ఆన్‌లైన్ డేటింగ్..ఫ్రెండ్‌షిప్ పేరిట రూ.6.49లక్షల మోసం

**హైదరాబాద్,అక్టోబరు16, ప్రభాతవార్త**

ఆన్‌లైన్ డేటింగ్, ఫ్రెండ్‌షిప్ స్కామ్‌లో ఓ వ్యక్తి రూ.లక్షల్లో మోసపోయాడు. దీంతో సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మలక్‌పేటకు చెందిన ఓ వ్యక్తి (32) వివాహం చేసుకునేందుకు మ్యాట్రిమోనియల్ సెర్చ్ చేస్తుండగా తాన్య శర్మ అనే మహిళ నుండి వాట్సాప్ కాల్ వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె రూ.1,950 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన తర్వాత అతన్ని ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌లో చేరు స్తానని అతనితో చెప్పింది. తర్వాత మిస్ ప్రీతి,మిస్ రితిక ఇద్దరు అమ్మాయిలు సదరు వ్యక్తిని సంప్రదించారు. దీంతో వారు హోటల్ బుకింగ్, మీటింగ్ కన్ఫర్మేషన్, సర్వీస్ టాక్స్, రీఫండ్ ప్రాసెస్, అకౌంట్ వెరిఫికేషన్ ప్రైవసీ సెక్యూరిటీ వంటి వివిధ రీఫండబుల్ కేటగిరీల డబ్బులు చెల్లించాలని చెప్పడంతో వారి మాటలు నమ్మి పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ. 6,49,840లు బదిలీ చేశాడు. తర్వాత పలు రకాలుగా డబ్బులు అడగడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

### బాణసంచా అక్రమ నిల్వలపై దాడులు..

**కొంపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

నగరంలో ప్రగతినగర్‌లోని రాజీవ్ గృహకల్పలో బాణసంచా అక్రమ నిల్వపై పోలీసులు దాడి నిర్వహించారు. ప్రగతినగర్‌లోని రాజీవ్ గృహ కల్పలోని బ్లాక్ నెం.19లోని నివాస భవనంలో ఎటువంటి భద్రతా జాగ్రత్తలు, ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేశారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఈ దాడి చేశారు. ఈ దాడిలో ఎన్.వెంకటేశ్వరులు అనే వ్యక్తికి చెందిన సుమారు రూ.2,00,000 విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంటు షాక్‌తో యువకుడు దుర్మరణం

### - మరో యువకుడి పరిస్థితి విషమం

**నార్సింగి, అక్టోబర్ 16 ప్రభాతవార్త :** కరెంటు షాక్‌తో ఓ యువకుడు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లంగర్‌హౌస్‌కు చెందిన ఓ వ్యక్తి గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామం పెద్దమ్మ కాలనీలో డి మజిల్ డెన్ జిమ్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేయిస్తున్నాడు. ఇక్కడ పని చేసేందుకు గుడిమల్కాపూర్‌కు చెందిన శివ(23), గంధంగూడ హిమగిరి కాలనీకి చెందిన శివ(23) లు వచ్చారు. ఇనుప స్టాండ్‌ను పైకి లేపుతుండగా పైనున్న హైటెన్షన్ వైర్ తగిలింది. ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌కు గురై హిమగిరి కాలనీకి చెందిన శివ సంఘటనా స్థలంలోనే అందరూ చూస్తుండగానే చనిపోయాడు. మరో శివను స్థానికులు కర్ర సహాయంతో పక్కకు తొలగించారు. అతను కదులకుండా పడిపోవడంతో గిరి అనే స్థానికుడు సీపీఆర్ చేశాడు. కొంత సమయానికి కళ్లు తెరిచాడు. కానీ పరిస్థితి విషమంగానే ఉంది. ఇతడిని చికిత్స నిమిత్తం, మృతుడి దేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కాపలదారును కరిచిన పెంపుడు కుక్క

**- యజమానురాలిపై కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 16, ప్రభాతవార్తః**

పెంపుడు కుక్క కరిచి ఒక కాపలదారుకు తీవ్ర గాయాలు కావడంతో పెంపుడు కుక్క యజమానిపై కేసు నమోదైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 72లోని వీధి నంబరు 5లో నివసించే శ్రీలక్ష్మి అనే మహిళ రాత్రి 7 గంటల ప్రాంతంలో తన పుఎంపుడు కుక్కను తీసుకొని బయటకు వాకింగ్‌కు వచ్చింది. అదే సమయంలో అక్కడే ఓ ఇంటికి కాపలదారుగా ఉన్న శైలేష్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆ కుక్క అతనిపై దాడి చేసింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పెంపుడు కుక్క యజమానురాలి నిర్లక్ష్యం కారణమంటూ శైలేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కుక్కను బ్లూ క్రాస్ సొసైటీకి అప్పగించారు. యజమానురాలిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## యువతి ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులతో తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్ నుంచి బ్రతుకు తెరువు కోసం గత ఆరు నెలల కింద హైదరాబాద్‌కు వలస వచ్చిన అనందిత మెహత (26) ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తుంది. బుధవారం అర్ధరాత్రి 11:30గంటలకు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని చనిపోయింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న బిసి జేఏసి నాయకులు

## రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

**-బిసి కుల సంఘాల ఐక్య వేదిక**

**గజ్వేల్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బిసి కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి బంద్‌కు అందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఆనాడే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బలహీన వర్గాలకు దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాల్లో భవిష్యత్తు ప్రభుత్వాలు రిజర్వేషన్ ద్వారా వారి అభ్యున్నతికి పాలుపడాలని ఆనాడే చెప్పారన్నారు. ఇప్పటికీ బిసి సమాజం ఇంకా వెనుకబాటుకు, వివక్షకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వివిధ రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో బిసిలకు సముచిత రిజర్వేషన్ వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి జేఏసి నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, మర్కంటి కనకయ్య, గుంటుకు శ్రీనివాస్, నాగపురి రమేష్, గడియారం స్వామిచారి, సందబోయిన ఎల్లయ్య, ముత్యాల విఠలాచారి, నాగపురి బాబు, బండ్ల స్వామి, కుమ్మరి పోచయ్య, సుధాకర్, కొమ్ము నరేష్‌యాదవ్, దండె యాదగిరి, కుమ్మరి యాదగిరి, శ్రీధర్, చిక్కుడు ప్రసాద్, కానుగుల రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ పార్క్‌లో పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తాం

**డిఎఫ్ఓ శ్రీనివాసులు**



మొక్కలు నాటుతున్న డిఎఫ్ఒ శ్రీనివాసులు తదితరులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** పట్టణ శివారులోని తేజోవనం అర్బన్ పార్క్‌ను పర్యాటకుల కోసం మరింత సౌకర్యవంతంగా చేయడం జరుగుతుందని డిఎఫ్ఒ శ్రీనివాసులు అన్నారు. గురువారం తేజోవనం అర్బన్ పార్కులో సిద్దిపేట ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ పర్యాటకుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇండియన్ బ్యాంకు మెగా ప్లాంటేషన్ చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ నెలకు ఒక మొక్క చొప్పున పూలు పూచే విధంగా ప్రణాళిక రూపొందించి మొక్కలు నాటడడం జరుగుతుందన్నారు. కాలుష్య నియంత్రణే లక్ష్యంగా సిద్దిపేట ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుధాకర్‌రావు, జోనల్ మేనేజర్ నాగభూషణం, బ్యాంకు అధికారులు వినయ్‌రాజు, బాబుసింగ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో మున్నూరు కాపుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్నూరు కాపులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గురువారం జిల్లా మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మహాసభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో మహాసభ కార్యవర్గ సభ్యులు,జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, జిల్లా కన్వీనర్ నాయకం మల్లేషం, సిద్దిపేట మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా నీలం యాదగిరి, గ్రామ సంఘం కమిటీ సభ్యులు,గ్రామ మున్నూరు కాపులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వద్దు : చింతల శ్రీనివాస్

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో ఉపాధ్యాయులు మెనూ పాటించి నిర్లక్ష్యం విడనాడాలని పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం, విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు.మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలతో ఉపాధ్యాయులు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** ఈనెల 13వ తేదీన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులోని మైత్రి క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా తరపున జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆర్.చందన, ఎండి.జినథ్‌లు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో వారిద్దరిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. అలాగే ఈనెల 14వ తేదీన గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడల్లో అండర్-17 వాలీబాల్ పోటీల్లో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల నుండి 9వ తరగతి విద్యార్థులు ఏ.అనూష, ఆర్.సిరిలు పాల్గొని మంచి ప్రతిభను కనబర్చి మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో పిడి అనంతరాములుచారి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళి మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్, గంజాయి, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై, షీటీమ్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

**ముఖ్య అతిథులుగా ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావిణ్య**
**తరలివచ్చిన 33 జిల్లాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు..**
**క్రీడలకు ఆతిథ్యం అందించడంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై ప్రశంసల జల్లు**

**పటాన్‌చెరు, అక్టోబరు 16, ప్రభాతవార్త :** 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ వాలీ బాల్ పోటీలు పటాన్‌చెరులోని మైత్రి మైదానంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నిరంతరం క్రీడల అభివృద్ధిని కాంక్షించే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆతిథ్యంలో 33 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడా జ్యోతిని అందించగా, ముఖ్య అతిథులుగా హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడా పతాకాన్ని ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం శాంతి కపోతాలను ఎగురవేశారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఆయా జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి క్రీడలను పటాన్‌చెరు వేదికగా నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని అభినందించారు. నిరంతరం క్రీడల అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే లభించడం పటాన్‌చెరు ప్రజల అదృష్టం అన్నారు. 150 కోట్ల జనాభా కలిగిన భారత దేశంలో క్రీడాకారుల ప్రాతినిధ్యం అతి స్వల్పమన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రథమ ప్రాధాన్యత లభిస్తుందన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ముఖ్య అతిథులు

సొంత నిధులు వెచ్చించి రాష్ట్రస్థాయి క్రీడలను పటాన్ చెరు వేదికగా నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఆమె అభినందించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ ప్రావిణ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్‌లు వాలీబాల్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేందర్, నియోజక వర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టుకు తగ్గిన వరద

**-క్రస్ట్ గేట్ల మూసివేత..16.591 టిఎంసిలు నిల్వ**

**పుల్‌కల్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** సింగపూరు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరబాద్ ప్రాంతాల్లో మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మూసేసి దిగువకు నీటి సరఫరాను ఆపేశారు. ప్రాజెక్టు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా లక్షకు పైగా క్యూసెక్కుల వరద వచ్చి చేరినట్లు ప్రాజెక్టు రికార్డులు దృవీకరిస్తున్నాయి. ప్రాజెక్టుకు కుడి వైపున అంతర్భాగంలో ఆనకట్టకు అమర్చిన రాతి తెట్టె కుంగిపోయిన ప్రాంతాన్ని ఈ ఏడాది వేసవికాలంలో రాష్ట్ర ఆనకట్ట భద్రత కమిటీ పరిశీలించిన విషయం పాఠకులకు విధితమే. ప్రాజెక్టులో 16 టీఎంసిలకు మంచి నీరు నిల్వ చేయవద్దంటూ చేసిన సూచనల మేరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని దిగువకు వదలడంతో మంజీర నది పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాలకు ముప్పుతప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సీజన్‌లో 243 టీఎంసిల నీటిని దిగువకు వదలడం విశేషం అని చెప్పవచ్చు. ప్రాజెక్టులో 17 క్రస్ట్ గేట్లు ఉండగా 11 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు వరదనీటిని సరఫరా చేశారు.

**ఆనకట్ట పటిష్టం చేసే వరకు...**

రాష్ట్ర ఆనకట్ట భద్రత కమిటి ఇచ్చిన నివేదిక దృష్ట్యా ప్రాజెక్టు ఆనకట్టను పటిష్టం చేసేంత వరకు నీఇ నిల్వలు అంతంత మాత్రంగానే చేయనున్నారు. ప్రాజెక్టు కుడి వైపున అంతర్భాగంలో ఆనకట్టకు



సింగూరు ప్రాజెక్టు దృశ్యం

అమర్చిన రాత్రి తెట్టె 300 మీటర్ల దూరం వరకు కుంగిపోయింది. ఇది రెండేళ్ల క్రితమే జరిగినా నీటి పారుదల శాఖ అధికారుల తాత్కాలికంగా కంకర, చిప్స్, ఇసుకబస్తాలు అమర్చి నీటి నిల్వలు చేశారు. ఈ ఏడాది వేసవి కాలంలో ఆనకట్ట భద్రత కమిటీ ప్రాజెక్టును పరిశీలించడంతో లొసుగులన్నీ వెలుగులోకి వచ్చాయి. ప్రాజెక్టు నిర్వాహణ పూర్తిగా లోపభూయిష్టంగా తయారయిందని సమగ్ర పరిశీలన అనంతరం కమిటి ప్రభుత్వానికి నివేదిక అందచేసింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిన అనంతరం ఆనకట్ట పటిష్టతకు చర్యల తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు అయితే గురువారం నాటికి 520.519 మీటకంలనఎ 16.591 టీఎంసిల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2779 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 3161 క్యూసెక్కులుగా నమోదయింది.

## వివోఏలను అరెస్టు చేసిన పోలీసులు

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారం కోసం చలో హైద్రాబాద్ కార్యక్రమానికి వెళుతున్న ఇందిరా క్రాంతి పథకం విఓఏలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. శాసన సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఐకెపి విఓఏలకు చేసిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో హైద్రాబాద్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ చేసిన హామిలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 15 సంవత్సరాలుగా పని చేస్తున్నా తమకు కేవలం 5వేల రూపాయలు మాత్రమే అందిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. తమకు ఇన్సురెన్స్, హెల్త్ కార్డులు, డ్రెస్ కోడ్‌ల సౌకర్యాలను కల్పిస్తామని హామి చేసిందని గుర్తు చేశారు. హామిలలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేయాలని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటాలు ఆగవని హెచ్చరించారు. జిఓ 58పి రద్దుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

## ఎల్గోయి జడ్పీహెచ్ఎస్‌లో ప్రాజెక్టుల ప్రదర్శన

**మనూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా మొబాయిల్ సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఫిజిక్స్, బయో సైన్స్, గణిత విషయాలకు సంబంధించి పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి విద్యార్థులకు ప్రాజెక్టులపై వివరించారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, మండల విద్యాధికారి రాజశేఖర్ శెట్కార్,విషయ నిపుణులు శ్రీనివాస్, రాజేశ్వర్, వినయ్‌కుమార్‌లు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవి సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగాయత్ సమాజ్ నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

**జహీరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గ వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులుగా ఆగూర్ శివరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో గురువారం సమాజ్ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా నుంచి అధ్యక్షుడు ఇప్పేపల్లి నరసింహులు, ప్రధాన కార్యదర్శి కొంక రాజేశ్వర్, కోశాధికారి పోలసు సంతోష్ పటేల్, యువజన ప్రధాన కార్యదర్శి రామోజీ నవీన్, స్థానిక లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ శెట్కార్, ప్రధాన కార్యదర్శి రేకుళ్లి సుభాష్‌లు హాజరు కాగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోహీర్ మండలం నుంచి బిల్లాపాటి విజయకుమార్, మొగుడంపల్లి మండలం నుంచి ఎం రామ్‌శెట్టి, ప్రధాన కార్యదర్శిగా ఎల్ విజయ్‌కుమార్, ఝరాసంగం మండలం నుంచి అధ్యక్షులుగా పట్లోళ్ల రవిపటేల్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల పరమేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన లింగాయత్‌సమాజ్ కార్యవర్గాన్ని వీరశైవ లింగాయత్‌లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



తాలుకా లింగాయత్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

# తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు, కూతుళ్లు

**ఆర్డీవో వద్దకు తరలివచ్చిన పలువురు వృద్ధ దంపతులు**

**గజ్వేల్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిదండ్రులకు పిల్లలు పెద్దగా ఎదిగి వారిపాలిట శాపంగా తయారయ్యారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను పట్టించుకోకుండా కొడుకులు, కూతుర్లు బయటకు గెంటేస్తు న్నారు. ఇలాంటి సంఘటనలు గత రెండు సంవత్సరాల నుండి ఎన్నో జరుగుతున్నాయి. ముసలి తనంలో తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ బుక్కెడు బువ్వ పెట్టడానికి ఇష్టపడని కొడు కులు, కూతుర్లు తల్లిదండ్రుల ఆస్తులను మాత్రం ముందుగానే రాయించుకొని వారితో ఏమి పని అనే విధంగా తల్లిదండ్రులను రోడ్డుపైకి లాగుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలా లకు చెందిన వృద్ధ దంపతులు తమ కొడుకులు చూడడంలేదని కొందరు, కూతుర్లు పట్టించుకోవడం లేదని కొందరు గురువారం గజ్వేల్ ఆర్డీవో కార్యా లయానికి తరలివచ్చారు. ఆర్డీవో చంద్రకళకు ఆ వృద్ధులు తమ బాధను వెళ్లబుచ్చుకున్నారు. గతం లో రెండుమూడుసార్లు ఇలాంటి విషయాలు జరిగి నప్పుడు కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ కూతుర్లు, కొడు కులు, కోడళ్ల తీరు మారకపోవడంతో మరోసారి ఆర్డీవోను ఆశ్రయించారు. అదేవిధంగా గజ్వేల్ మం డలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిన్నమ్మగారి ఎల్లారెడ్డికి ఒకే కూతురు ఉండగా అదే గ్రామానికి చెందిన నారా సురేందర్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరి పించారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డి కూతురు మృతి చెందగా అతని అల్లుడు సురేందర్‌రెడ్డి మరో అమ్మాయిని వివాహం చేసుకొని హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు.గతంలోనే ఎల్లారెడ్డికి సంబంధించిన 10 ఎకరాల భూమిని మనవళ్ల పేరుపై ఎల్లారెడ్డి చేయడంతో ప్రస్తుతం ఎల్లారెడ్డి బాగోగులు చూసేవారు లేకుండా పోయారు. అతని కాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో పాటు కనీసం తిండి లేక ఇబ్బంది పడుతుండడంతో తమ సమీప బంధువు అతని గోస చూడలేక అతని అల్లునికి పలుమార్లు ఫోన్‌చేసి చెప్పినా స్పందించక పోవడంతో ఎల్లారెడ్డిని ఆర్డీవో కార్యాలయం వద్దకు తీసుకువచ్చి ఆర్డీవో చంద్రకళ దృష్టికి తీసుకువ చ్చారు. ఈ విషయంపై తమ అల్లుడు, మనుమళ్లకు నోటీసు అందజేసి పిలిపించి మాట్లాడతానని తెలపడంతో చేసేదేమీలేక వెనుదిరిగారు. అలాగే రాయ పోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన గొర్రె రాఘవరెడ్డి, గొర్రె ప్రమీల దంపతులు తమ కొడుకు



ఆర్డీవో కార్యాలయానికివచ్చిన అలిరాజపేటకు చెందిన సరోజ,దిలాల్‌పూర్‌కు చెందిన చిన్నమ్మగారి ఎల్లారెడ్డి

పట్టించుకోవడంలేదని, ఎనిమిది సంవత్సరాలుగా బతుకుదెరువు కోసం కూచారం సమీపంలో ఉన్న అట్టల కంపెనీలో పనిచేస్తున్నానని, ఇప్పుడు పని చేయడానికి వయస్సు సహకరించకపోవడంతో రాఘవరెడ్డి కూతురు నాగరాణి ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. అదే గ్రామానికి చెందిన కర్రోళ్ల నర్సమ్మ సైతం తన ఇద్దరు కొడుకులు తనను పట్టించుకోవడంలేదని తిండి పెట్టడంలేదని 15 రోజుల క్రితం పలు మీడియాల్లో కథనాలు రావ డంతో ఆర్డీవో చంద్రకళ గురువారం ఆమె కొడుకు లను పిలిపించి మరోసారి కౌన్సిలింగ్ ఇప్పించారు. జగదేవ్‌పూర్ మండలం అలిరాజపేట గ్రామానికి చెందిన సరోజ కుమారుడు హైదరాబాద్‌లో ఉంటూ తనను సరిగా చూడడంలేదని తనకు నెలనెలా ఇస్తున్న డబ్బులు సరిపోవడంలేదని మూడు సంవత్సరాల క్రితం భర్త నారాయణరెడ్డి మరణించారని, గతంలో హైదరాబాద్‌లో కూతురు డబ్బులతో ప్లాటు కొనుగోలు చేయగా ఆ ప్లాటు సైతం నా కొడుకు, కోడలు తీసుకున్నారని, ఆ ప్లాటు నాకు ఇప్పిస్తే నా బ్రతుకు నేను బతుకుతానని ఆర్డీవో చంద్రకళకు తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఉపాధ్యాయునికి టిపిటిఎఫ్ సభ్యత్వాన్ని అందజేస్తున్న రాజయ్య

## పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

**-టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజయ్య**

**జగదేవ్‌పూర్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్‌సిని అమలు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పలు పాఠశాలల్లో టిపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జులై నుండి రావాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, మోడల్ స్కూల్‌లో పనిచేసే తాత్కాలిక బోధకులకు వెంటనే వేతనాలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు సైతం 7 నెలలుగా వేతనాలు అందలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి పోచయ్య, గజ్వేల్ జోన్ కన్వీనర్ జె.శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ ఎన్.శంకర్, మండల బాధ్యులు భాస్కర్, జలంధర్‌రెడ్డి, శ్రీధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ అమలు చేయడమే సామాజిక న్యాయం

**హుస్నాబాద్ జెఏసి కన్వీనర్ లక్ష్మారెడ్డి**



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడమే సామాజిక న్యాయంఅని హుస్నాబాద్ జెఏసి కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రోజున పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిసిలకు సామాజిక న్యాయం కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 18వ తేదీన బిసి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ బంద్‌కు జెఏసి, ఎంఆర్‌పిఎస్, తెలంగాణ అంబేద్కర్ సంఘాలు మద్దతు ప్రకటించినట్లు వివరించారు. బిసిల రిజర్వేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై వారు మండిపడ్డారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటస్వామి, కండె సుధాకర్, లింగారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సమ్మయ్య, జగదీష్, ప్రభాకర్, ఆశీర్వాదం, లక్ష్మీ, శ్రీనివాస్, వెంకన్న, కొమురయ్య, దొడ్డి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ



వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** రైతు నేస్తం అవార్డు గ్రహీత, రచయిత పులి రాజు రాసిన వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకాన్ని గురువారం గజ్వేల్‌లోని మల్లారెడ్డి గార్డెన్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సి.వీరేందర్, కార్గిల్ యుద్ధ వ్యూహకర్త, సినీ నిర్మాత డాక్టర్ జిజె.రావు, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిరాజు, ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రంతో పాటు ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబసభ్యుల చేతులమీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతు కుటుంబాలలో భరోసా నింపి భవిష్యత్తులో ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దనే దిశగా ప్రయత్నం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకటరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయకులు యాదమల్లు, నాయిని సందీప్‌కుమార్, మానుక ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసిపికి శ్రీరామరక్ష స్తోత్ర పుస్తకం అందజేసిన రామరాజు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** భద్రాచల దేవస్థానం వారు అందించిన శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ పుస్తకాన్ని గురువారం గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు గజ్వేల్ ఏసిపి నరసింహులుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి : ఉమేష్‌యాదవ్



మాట్లాడుతున్న కొమ్ము ఉమేష్‌యాదవ్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 16 (ప్రభాతవార్త):** ఈనెల 18న నిర్వహించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా బిసి సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలోలన బిసిలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా, బిసిలకు మద్దతుగా ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 18న నిర్వహించే రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలన్నారు. బిసిల రిజర్వేషన్లు ఆపడం బిసిల నోటి దగ్గరి ముద్ద లాక్కోవడమేనని అన్నారు. బిసి వ్యతిరేక పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని, బిసి రిజర్వేషన్లు 42 శాతం యదావిధిగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్ళాలని సూచిస్తూ, తెలంగాణ రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం పట్టణ అధ్యక్షుడు బాబు ముదిరాజ్, సాయిబాబా, శేఖర్, ప్రకాష్, యాదగిరి, లక్ష్మణ్, శ్రీను, మల్లయ్య, రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంటల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్**

**నర్సాపూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** పంటల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం నర్సాపూర్‌లోని రైతు వేదికలో నర్సాపూర్ డివిజన్, మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయిల్ ఫామ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నత్నాయపల్లి గ్రామాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సుడిదోమ, అగ్గి తెగులు, మెడ విరుపు తదితర చీడపీడలు ఆశిస్తే పాటించవలసిన సస్యరక్షణ చర్యలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఏ డి ఏ టెక్నికల్ వినయ్ కుమార్, జిల్లా టెక్నికల్ అధికారులు, నర్సాపూర్ వ్యవసాయ సంచాలకులు ఏ డి ఏ సంధ్యారాణి, నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారి దీపికతో పాటు నర్సాపూర్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయిల్ ఫామ్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## రామాయంపేటకు చేరుకున్న అయ్యప్ప స్వాముల పాదయాత్ర

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబ, 16, ప్రభాతవార్త:**
లోక కళ్యాణార్థం నిర్మల్ జిల్లా శ్రీజ్ఞానసరస్వతి దివ్యక్షేత్రమైన బాసర నుండి కేరళ రాష్ట్రంలోని శ్రీఅయ్యప్పస్వామి సన్నిధి శబరిమలవరకు చేపట్టిన అయ్యప్పస్వాములపాదయాత్ర గురువారం రామాయంపేట పట్టణానికి చేరుకుంది. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో బి.సునీల్‌దత్ గురుస్వామి నేతృత్వంలో ఈయాత్ర జరుగుతుంది. 55మంది అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు పాదయాత్రగా ఈనెల 12వ తేదీన బయలుదేరిన వారంతా గురువారం పట్టణంలోని విష్ణు రెసిడెన్సీ అపార్ట్మెంట్‌లో జరిగిన మహాపడిపూజలో పాల్గొని బిక్ష చేశారు. ఈ సాయంత్రం తిరిగి రామయంపేట నుంచి పాదయాత్ర కొనసాగింది. నవంబర్ 25వ తేదీన ఈ పాదయాత్ర శబరిమలకి చేరుకుంటుందని. మొత్తం 1450 కిలోమీటర్లు ఈయాత్ర ఉంటుందని గురుస్వామి బి.సునీల్‌దత్ తెలిపారు. రోజుకు సుమారు 35-40 కిలోమీటర్ల మేర నడుస్తామన్నారు. తాను తన భక్త బృందంతో నాలుగవసారి పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈయాత్రలో బాసర, నిజామాబాద్, కామారెడ్డి, గాంధారి ప్రాంతాలకు చెందిన స్వాములు ఉన్నట్లు తెలిపారు. అందులో 6గురు కన్నెస్వాములు సైతం పాదయాత్ర చేస్తున్నారన్నారు.

## ఉపాధ్యాయులచే సన్మానం అందుకున్న శృతి



ప్రథమబహుమతి అందుకున్న శృతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**న్యాల్‌కల్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత-పరిపూర్ణ జీవితమునకు మార్గం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల పరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న ఎం.శృతి జిల్లా స్థాయిలో ప్రతిభచాటి ప్రథమ బహుమతిని అందుకుంది. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన శృతిని గురువారం పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందించి ఆశీర్వచనాలుచేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నతశిఖరాలకు చేరుకోవడం తథ్యమని, అందుకు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

## జీవాలకు వ్యాధి టీకాలు ఇప్పించండి

**పాపన్నపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు టీకాలు ఇప్పించాలని వెటర్నరీ ఏడి పవన్‌కుమార్ సూచించారు. గురువారం పాపన్నపేటలో ఆయన అధ్వర్యంలో 346 పశువులకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలల వయస్సు పైబడిన పశువులకు టీకా ఇప్పించాలని కోరారు. రోగనిరోధక శక్తిని పరిశీలించడానికి 7 గేదెలు, రెండు ఆవుల రక్త నమూనాలు సేకరించామన్నారు. ఈ వ్యాధివల్ల పశువుల్లో ఉత్పాదక పునరుత్పత్తిశక్తి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాపన్నపేట మండల వైద్యాధికారి సౌమ్య, జేవిఓ సతీష్‌కుమార్, సురేష్, సమీర్, సిబ్బంది, యాదయ్య, సాయిలు, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గోదాం లీజు వేలంపాట రూ.లక్షలు



కొత్తపల్లి సహకార సంఘంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం గోదాంను యేడాది కాలం పాటు లీజు ఇవ్వడం కోసం గురువారం వేలం పాట నిర్వహించగా రూ.3 లక్షలకు ఖరారు అయినట్లు చైర్మన్ త్యార్ల రమేష్ తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన అశోక్ లీజు హక్కుపొందారని వివరించారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఆఫీసును ముట్టడించిన ఐడిఎస్ఎంటి కాలనీ బాధితులు




బల్దియాను ముట్టడించిన ఐడిఎస్ఎంటి కాలనీ బాధితులు

**జహీరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
ఐడిఎస్ఎంటి కాలనీలోని సర్వే నంబర్ 158లో 10 ఎకరాల విస్తీర్ణంలో గల ప్లాట్లు, ఇళ్ల యజమానులు గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయానికి తాళంవేసి కార్యాలయం ముందు బైఠాయించి ధర్నాచేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ ప్లాట్లను, ఇళ్లను ప్రయివేటువ్యక్తులు వచ్చి ధ్వంసం చేస్తున్నా, అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరించడంపట్ల ఆందోళనచెందుతూ తమకు న్యాయంచేయాలని డిమాండ్‌చేశారు. 25సంవత్సరాల క్రితమే తమకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని, ప్లాట్లలో లక్షలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు సైతం చేపట్టారని గుర్తు చేశారు. కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అరెస్టుచేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈసందర్భంగా బిఆర్ఎస్‌నాయకులు నామరవికిరణ్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధితులకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ తంజీమ్, నాయకులు వెంకటేశంగుప్తా, నర్సింహారెడ్డి, వెంకట్ సాగర్‌లు మద్దతు పలికారు.

## పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

**చిలిపిచెడ్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైనటువంటి చిలిపిచెడ్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పోషణమాసం సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులకు, సమతుల ఆహారం గురించి, ఎనీమియా చాలెంజ్ గురించి, వివరించడం జరిగింది. స్థానికంగా దొరికే, 37రకాల ఆకుకూరల గురించి వివరించడం జరిగింది. తక్కువఖర్చుతో ఎక్కువపోషకాలు ఉన్న ఆహారపదార్థాలను తయారుచేసి స్టాల్ ఏర్పాటుచేయడం జరిగింది. విద్యార్థినీవిద్యార్థులకు, పోషకాహారంపై వ్యాసరచన పోటీలు అలాగే డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. అందులో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులతో పోషణప్రతిజ్ఞ చేయించడం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ విట్టల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోషిమాత, చండూరు కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ధనమూర్తి, ఉపాధ్యాయబృందం ఆదినారాయణ, శంకర్‌సింగ్‌రాథోడ్, మల్లేశం, రాజ మల్లేశం, నాగమణి, కవిత, ఆర్‌ఐలు సునీల్‌చౌహాన్, వెంకటేశం, ఎంఎల్‌హెచ్ పి.ప్రతిమ, అన్నిగ్రామాల అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# సొంత గూటికి మాజీ సర్పంచ్‌లు

### -మాజీమంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికలు



మాజీ మంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచులు

**మునిపల్లి, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలం చిన్నచెల్మెడ, బోడపల్లి మాజీ సర్పంచ్‌లు గాడిఖాన విజయభాస్కర్, బిందు రామక్రిష్ణలు గురువారం మాజీమంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి అనంతరం జరిగిన ఎంపి ఎన్నికల్లో విజయభాస్కర్ కాంగ్రెస్‌లో చేరగా బిందు రామక్రిష్ణ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బిఆర్ఎస్‌లో చేరడానికి వీరు నిర్ణయం తీసుకుని మాజీ మంత్రి హరీష్‌రావు నివాసంలో కలిసి బిఆర్ఎస్‌లో చేరారు. వీరితోపాటు కాంగ్రెస్, బిజెపిల నుండి పెద్దలోడ నరేష్, తక్కెడపల్లి సత్తయ్య, బోడిశెట్టిపల్లి అక్రమ్, అశోక్ తదితరులు పార్టీలో చేరారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నయవంచనకు గురిచేస్తుందన్నారు. ప్రజాపాలన పేరిట మోసంచేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మండలంలో మరోసారి గులాబిజెండా రెపరెపలాడటానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మీనాక్షిసాయికుమార్, మండల సీనియర్ నాయకులు పెద్దలోడి వెంకటేశం, గడ్డం భాస్కర్, మొగులయ్య, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, ప్రభు, నాయకులు భాగన్న, అప్సర్, పెద్దలోడి మొగులయ్య, ఒగ్గు మోహన్, దత్తు, తక్కెడపల్లి ఆనంద్, సుల్తాన్, నవీన్, ఉపసర్పంచ్ దత్తు, రాజు, పెద్దలోడి రాజు, లింగంపల్లి సుధాకర్, అల్లాపురం ఇబ్రహింలు వున్నారు.

## అర్బన్ పార్క్ పనులను పరిశీలించిన అటవీశాఖ అధికారి



మీడియాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖ అధికారి

**రామాయంపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం అక్కన్నపేట అడవిప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న నగరయోజన (అర్బన్‌పార్క్) నిర్మాణ పనులను జిల్లా ఫారెస్ట్ అధికారి జోజి పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేవిధంగా సుమారు రెండుకోట్ల రూపాయలతో నిర్మిస్తున్న అర్బన్‌పార్క్‌లో పర్యాటకులు సేదతీరేందుకు బల్లలు ఏర్పాటుచేశారు. అడవి అందాలను వీక్షించేందుకుగాను టవర్ ఏర్పాటు చేయడంతో టవర్‌పనులను ఆయన పరిశీలించారు. నెలరోజుల్లోపు నిర్మాణ పనులు పూర్తిచేసి డిసెంబర్ మొదటివారంలో అర్బన్‌పార్క్ ప్రారంభోత్సవాన్ని చేస్తామని ఆయన పేర్కొన్నారు. పర్యాటకులకు ఆకర్షించే విధంగా అర్బన్‌పార్క్ తయారుచేసి అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీకి చెప్యాల వందన ఎంపిక



వందనకు రజితపతకాన్ని అందిస్తున్న కె.సతీష్‌కుమార్

**కౌడిపల్లి, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగం యోగా పోటీలకు మండల పరిధిలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన చెప్యాల వందన ఎంపికైంది. ఈ నెల 26వ తేదిన సంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలలో వందన పాల్గొననుంది. వందన ప్రస్తుతం నర్సాపూర్‌లో శ్రీవాత్సల్ గురుకుల పాఠశాలలో ఏడవతరగతి చదువుతుంది. ఇటీవల ఇంటర్‌స్కూల్ యోగాసన పోటీ చాంపియన్‌షిప్ 2025 స్వామివివేకానంద స్కూల్ ఆఫ్ యోగా, రంగారెడ్డిజిల్లా యోగా అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఛాంపియన్‌షిప్ 2025 ఎస్‌జిఎఫ్ (స్టేట్ లెవెల్ స్పోర్ట్సు జోన్) అండర్ 14 విభాగంలో వందన పాల్గొని రజిత(సిల్వర్)పథకం సాధించింది. దీంతో వందన రాష్ట్రస్థాయి యోగాపోటీలకు ఎంపికైంది. శ్రీవాత్సల్ గురుకుల్ పాఠశాల ప్రిన్సిపాల్ చైర్మన్ కె.సతీస్‌కుమార్, ప్రిన్సిపాల్ బాలజ్యోతి వందనను అభినందించారు. వందన భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని శ్రీవాత్సల్ గురుకుల్ ఉపాధ్యాయబృందం ఆకాంక్షించారు. చెప్యాల వందన రాష్ట్రస్థాయిలో యోగాపోటీకి ఎంపిక అవ్వడంపట్ల సదాశివపల్లి గ్రామస్థులు అభినందించారు.

## స్వచ్ఛంద సేవలతో సమాజంలో గుర్తింపు

### -మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి

**చౌటకూరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
స్వచ్ఛందసేవ కార్యక్రమాలతో సమాజంలో మంచిగుర్తింపు దక్కుతుం దని మాజీఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి అన్నారు. మండలం లోని పోసానిపల్లి గ్రామంలోని కేంద్ర ప్రాథమికపాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు పిఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం యనిఫాంలను అందచేశారు. విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు ముందుకువచ్చిన పిఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పార్కల రాంరెడ్డిని సుభాష్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు యూనిఫాంలు అందచేసిన రాంరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాలువాతో సత్కరించి మొమెంటోను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్జున్, ఉపాధ్యాయులు కిషన్, అనసూయదేవి, శ్రీనివాస్, కవిత, నాయకులు రామచంద్రారెడి, గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, మొగులయ్య, నరేందర్‌గౌడ్, రాజిరెడ్డి, కిరణ్ గౌడ్, ఎల్ఎన్ రాజు పాల్గొన్నారు.

## బిసిలపై కపటప్రేమ చూపే సిఎం

### -మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ



విలేకర్ల సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు కల్లూరి సంజీవ

**కౌడిపల్లి, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42'% రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పి, బిసిలను మోసంచేసి ఇప్పుడు కోర్టులంటూ బిసిలపై కపట ప్రేమ చూపే సిఎం రేవంత్‌రెడ్డికి స్థానికసంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పగలమని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ హెచ్చరించారు. గురువారం మండలంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందుకు మాల మహానాడు సంపూర్ణమద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇడబ్ల్యుఎస్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీలందరూ ఏక తాటిపైకి వచ్చి ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమావేశంలో మెదక్ జిల్లా అంబేద్కర్ సంఘం నాయకులు శివ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మన్నె భిక్షపతి, జాజితండా మాజీసర్పంచ్ రమేష్‌నాయక్, గోడల సత్యనారాయణగౌడు, చంద్రునాయక్, కట్రోత్ రాము, మన్నె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వీవోఏల ముందస్తు అరెస్ట్




అరెస్టు అయిన ఐకెపి వీఓఏలు

**చిలిపిచెడ్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
ఐకెపి వీవోఏల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాదులోని సెర్ప్ ఆఫీస్ ముట్టడికి వెళుతున్న ఐకెపి వీవోఏలను మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండల పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. అనంతరం మండల వీవోఏలు మాట్లాడుతూ ప్రతినెలా కనీసం రూ.20వేలు జీతం ఇవ్వాలని, ప్రతి గ్రామానికి సంఘానికి ట్యాబ్, నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలన్నారు. 58 జివో రద్దు చేసి సెర్ప్ ఉద్యోగుల గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్, ప్రమాద బీమా కల్పించాలన్నారు. గ్రామ సంఘాల ట్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని కోరారు. అర్హులైనవారికి సిసిలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. బకాయిపడిన శ్రీనిధినిధులు వెంటనే విడుదలచేయాలి అని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వీవోఏలు వీరమణి, బాగయ్య, మాధవి, రేణుక, సరిత, లక్ష్మి, మంజుల ఉన్నారు.

## అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### -సూపర్‌వైజర్ నాగమణి

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీవేంకటేశ్వర ఆలయప్రాంగణంలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ ఆహారవారోత్సవాల ముగింపుకార్యక్రమాన్ని (సామూహిక శ్రీమంతాలు, సామూహిక అక్షరాభ్యాస, అన్నప్రాసన) నిర్వహించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ పోషకాహార ప్రాముఖ్యత, గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రతలపై, చిన్నారులపట్ల వ్యవహరించే తీరుపై అవగాహన కల్పించారు. వంటకాలలో నూనె, ఉప్పు, చక్కెర, పులుపు తగ్గించుకోవడం గురించి తల్లులకు పలుసూచనలిస్తూ ప్రతిజ్ఞచేయించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సన్మానంచేశారు. స్టార్‌మదర్స్‌గా ఎంపికైన తల్లులను సన్మానించారు. ఆరోగ్యలక్ష్మి పథకంద్వారా గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న ఒకపూట భోజనపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి, కిశోరబాలికలు, పిల్లలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలి

### -నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చూసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు.. గురువారం పెద్దశంకరంపేటతో పాటు మండల పరిధిలోని మూసాపేట, లక్ష్మాపూర్, మాడ్షెట్‌పల్లి దానంపల్లి, కోలపల్లి, గ్రామాలలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. పేదలకు ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, నారా గౌడ్, ఆర్ఎన్ సంతోష్‌కుమార్, మురళి పంతులు, రాజేందర్‌గౌడ్. సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, కుంట్ల రాములు, రోమాల సాయిలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

**పెద్దశంకరంపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
గర్భిణీలు, బాలింతలకు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ ఆసూరి సరళ అన్నారు. గురువారం స్థానిక పూసల గల్లి 9వ అంగన్వాడీ కేంద్రంలో పోషకాల ఆహారవారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఆమె వారికి సూచించారు. అంగన్వాడీకేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలకు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యాబోధన చేయాలి

### -ఎంపిడిఓ సత్తయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఓ సత్తయ్య

**కంగ్టి, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
మండలకేంద్రం అయిన కంగ్టిలోని కస్తూరిబాగాంధీ పాఠశాలకు గురువారం స్థానిక ఎంపిడిఓ సత్తయ్య వెళ్లి విద్యార్థులకు మాథ్స్ సబ్జెక్ట్‌ను బోధించారు. పదవతరగతిలో విద్యార్థులు మార్కులను పెంపొందించుకోవాలని, అలాగే వారి టైం టేబుల్ ప్రకారం ఏవిధంగా ప్రిపేర్ అవ్వాలని సూచనలు చేశారు, విద్యార్థులు ప్రతి ఒక్కరు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని, చదివే పాఠశాల అలాగే తల్లిదండ్రులపేర్లు నిలబెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు ఉన్న సమస్యల గురించి అరాతీశారు, సమయానికి మెనూప్రకారం భోజనం వడ్డిస్తున్నారా, లేదా, అలాగే అన్నిసదుపాయలు ఉన్నాయా అని ఆరాతీశారు. వారివెంట ఎస్ఓ విజయ లక్ష్మి, ఉపాధ్యాయురాలు ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు ఇవ్వాలి




మాట్లాడుతున్న సిపిఎం మండల నాయకులు రాజయ్య

**కొండాపూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మండల నాయకులు కె.రాజయ్య డిమాండ్‌చేశారు. సిఐటియు ఆఫీసులో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మండల నాయకులు కె.రాజయ్య మాట్లాడుతూ జివో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. పాతకేటగిరీలన్నిటిని కొనసాగించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం అందించే సరుకులు, సబ్బులు, బెల్లం, సంవత్సరానికి రెండుజతలు బట్టలు, బూట్లు, నూనె, ప్రతికార్మికుడికి రూ.500చొప్పున ఒకకార్మికుడికి రూ. 9,500 జీతం ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. సభలో పంచాయతీ కార్మికులతో చర్చిస్తుండగా వారికి ఏమి అందడంలేదని, వచ్చేజీతంలో కూడా కొందరికి కొసమెరుపులాగా స్థానిక అధికారులు వెయ్యి రూపాయలు కట్‌చేస్తున్నారని తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. వెంటనే వారికి ఇవ్వాల్సిన సరుకులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంజీవులు వెంకయ్య, విజేందర్, కృష్ణ, కమలమ్మ, సంతోష ఆంజనేయులు, కిషన్, సంతోష, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి కార్యాలయం ప్రారంభం

**పటాన్‌చెరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
అత్యాధునిక సౌకర్యాలతో, విశాలంగా ఏర్పాటు చేసిన నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సిసి) కార్యాలయాన్ని గురువారం గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, ఆతిథ్యక్యాంపస్ లైఫ్‌డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నో అంశాలలో అత్యుత్తమంగా రాణిస్తూ, జాతీయ, అంతర్జాతీయ క్యాంపులలో పాల్గొని ఇటు గీతంకు, అటు సంగారెడ్డి ఎన్‌సిసి బెటాలియన్‌కు విద్యార్థులు మంచిపేరు తెస్తున్నారని, ఇకమీదట ఇనుమడించిన ఉత్సాహంతో మరింతగా వన్నెతేవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీడైరెక్టర్ డాక్టర్ నారాయణరావు, కేర్‌టేకింగ్ ఆఫీసర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐపై అతిగా ఆధారపడొద్దు

### -హైదరాబాద్ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ నరేష్‌కుమార్‌శర్మ

**పటాన్‌చెరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
కృత్రిమమేధస్సు (ఏఐ) నిజంగా తెలివైనది కాదని, అది మానవ నిర్మిత గణాంక నమూనాల ద్వారా మాత్రమే పనిచేస్తుందని హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ నరేష్‌కుమార్‌శర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు యుగంలో మహాత్మాగాంధీ జీవితం, వారసత్వాన్ని తిరిగి సందర్శించడంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసంచేశారు.

## సిర్గాపూర్ జడ్పిహెచ్ఎస్‌లో సిపిఆర్‌పై అవగాహన



విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సిపిఆర్‌పై 108 ఈఎంటి గురప్ప అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడగలిగే సాంకేతికప్రక్రియ సిపిఆర్ అని గుర్తుచేశారు. స్పృహకోల్పోయిన వారి ఛాతీపై గట్టిగా, వేగంగా నొక్కాలని డెమో ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్, పైలట్ రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులుగా జగదీశ్వర్

### -గౌరవ అధ్యక్షులుగా పోచారం అశోక్

**పటాన్‌చెరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయంలో పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులను ఎన్నుకున్నారు. వీరశైవ లింగాయత్ అధ్యక్షులుగా జగదీశ్వర్, గౌరవ అధ్యక్షులుగా పోచారం అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కొంక రాజేశ్వర్, కోశాధికారి పోలీస్ సంతోష్‌పాటిల్, ఉపాధ్యక్షులు అవంచ సుధాకర్, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, జిల్లా సలహాదారు చెలిమిడ రాములు, కార్యదర్శి నీలకంఠం గంతల బసవరాజు, గౌరవ అధ్యక్షులు ఆకుల శంకరప్ప, బసవరాజు, సంతోష్, రాజేశ్వర్, నవీన్, రామోజీ, కోనాపురం శివకుమార్, నాగేశ్వర్, చాట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.